క్లుప్తంగా

ఏఎస్‌ఐగా పదోన్నతి



గద్వాల క్రైం: మల్దకల్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దేవయ్యకు రాష్ట్ర పోలీసు శాఖ ఏఎస్‌ఐగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం కార్యాలయంలో దేవయ్యను అభినందించారు. అవినీతికి తావు లేకుండా పోలీసు శాఖపై నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. రాజోలి మండలం కేంద్రానికి చెందిన తెలుగు శంకర్ వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం మంజూరైన రూ.3 లక్షలు ఎల్‌ఓసీ, మానవపాడుకు చెందిన ఉమామహేశ్వరికి రూ.2 లక్షల ఎల్‌ఓసీ అందజేసినట్లు పేర్కొన్నారు.

మాజీ ఏజీపీకి అండగా ఉంటాం



అలంపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఏజీపీ నరసింహ్మకు అండగా ఉంటామని అలంపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గవ్వల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని క్యాతూర్ గ్రామంలో నరసింహ్మను ఏజీపీ మధుతో కలిసి సోమవారం పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేసినట్లు పేర్కొన్నారు.

త్వరలో మరమ్మతు చేపడుతాం



అయిజ: మండలంలోని ఉప్పల క్యాంప్ క్రాస్ రోడ్డు వద్ద అయిజ– రాయచూర్ రోడ్డుపై ఉన్న కల్వర్టును సోమవారం ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి, ఏఈ అల్తాఫ్ పరిశీలించారు. కల్వర్టుపై గుంతలు పడిన ప్రదేశం వద్ద ముళ్ల కంచె, ప్రమాదాన్ని సూచించే గుర్తు ఏర్పాటు చేయించారు. త్వరలో పూర్తిస్థాయి మరమ్మతు చేపట్టనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

తిరంగా ర్యాలీ విజయవంతం చేయాలి

శాంతినగర్: భారత ఆర్మీకి అండగా, ఉగ్రవాద దాడులను ఖండిస్తూ చేపడుతున్న తిరంగా ర్యాలీలో అఖిలపక్ష రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు నరసింహులు కోరారు. జమ్మూలోని పెహల్గాంలో హిందువులపై జరిగిన ఉగ్ర దాడులను ఖండిస్తూ వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో మంగళవారం ఉదయం ఐలమ్మ విగ్రహం వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు సోమవారం తెలిపారు. అఖిలపక్ష నాయకులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల వారు జాతీయ జెండా పట్టుకుని సైనికులకు అండగా నిలవాలని పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఉండవెల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రాజ్‌కుమార్ ఫౌండేషన్ నిర్వాహకురాలు రత్నకుమారి అన్నారు. మండలంలోని కలుగోట్ల గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ తీసుకున్న 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముందస్తు సాగుకు సమాయత్తం

- మొదలైన మెట్ట పంట సాగు పనులు
- పొలాల్లో బిజీబిజీగా రైతన్నలు



ధరూరు శివారులో వేసవి దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

ధరూరు: ముందస్తు ఖరీఫ్ సాగుకు మండల రైతులు సమాయత్తమవుతున్నారు. గత రెండు రోజులుగా మండలంలో ఓ మోస్తరు వర్షంతో పాటు వాతావరణం చల్లబడడంతో ఖరీఫ్ మెట్ట పంటలు సాగు చేసేందుకు పొలాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు దున్నుకుని పొలాలు సిద్ధం చేశారు. బోర్లు, ఇతర నీటి వనరులు ఉన్న రైతులు ఇప్పటికే పత్తిసాగుకు పనులు చేపట్టారు.

మెట్ట పంటలకు ప్రాధాన్యం

ముఖ్యంగా నడిగడ్డ ప్రాంతంలో ఎక్కువగా పండించే పత్తి పంట సాగుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పత్తితో పాటు ఆముదం, కంది, సజ్జ, జొన్న వంటి పంటలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు నవభారత్, గౌచ్- 4తో ఆయా పంటలకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

జోరందుకున్న పనులు

వ్యవసాయ పొలాల్లో చెత్త ఏరడం, కాల్చడం, ఆముదం సాగుకు అచ్చుకొట్టడం, పశువుల ఎరువులు చల్లడం, ఒండ్రు మట్టిని పొలాల్లో పరచి నేలలను సారవంతం చేయడం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పుడిప్పుడే రైతులకు ఆర్గనైజర్లు విత్తనాలు ఇస్తుండడంతో సాగు పనులు చేపట్టారు.

ముందస్తు చర్యలు శూన్యం

మండలంలో మరో వారం పది రోజుల్లో సాగు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ఏటా విఫలమవుతూనే ఉన్నారు. ఆలస్యంగా విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తుండడంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత ఏమన్నారంటే.. ప్రస్తుతానికి సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేవన్నారు. గ్రోమోర్ దుకాణాల్లో మాత్రం కమర్షియల్ పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, త్వరలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. విత్తనాలు, ఎరువులు అవసరమైన ప్రతి రైతుకు అందిస్తామని, ఆ ప్రకారమే ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపించినట్లు పేర్కొన్నారు.



ధరూరులో పైప్‌లైన్ పనులు చేపడుతున్న రైతులు

సుందరయ్య జీవితం ఆదర్శప్రాయం



అలంపూర్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిలో నాయకులు



గట్టులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గట్టు: పీడిత ప్రజల ఆశా జ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీవీ నర్సింహ మాట్లాడుతూ.. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన పుచ్చలపల్లి అసమానతలు లేని వర్గరహిత సమాజం కోసం కృషి చేసినట్లు తెలిపారు. వందల ఎకరాల భూమిని పేదల కోసం పంచి పెట్టినట్లు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి రూపకర్తగా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకురాలు నర్మద, నాయకులు స్వామి, హమాలీ సంఘం నాయకులు భీముడు, జయన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

అలంపూర్: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం అందరికీ అదర్శమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.రాజు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట ముఖ్య నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. భూస్వాములకు వ్యతిరేకంగా కూలీలను కూడగట్టి కూలీ సంఘాలు ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా ముఖ్య భూమిక పోషించారన్నారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, నర సింహ్మ, అయ్యప్ప, నూర్‌అహ్మద్, మహబుబ్ బాష, నజీర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం సీపీఎం కార్యదర్శి మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటాని కి పూలమాలలు వేసి నివాలర్పించారు.కార్యక్రమంలో నరసింహ, రాఘవేంద్ర, హుస్సేన్, బోయ లవన్న, విద్యార్థులు, హమాలీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయాలి

అయిజ: ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఎంఈఓ రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎమ్మార్పీ, సీఆర్పీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కేంద్ర ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. స్కూల్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రంలో, ఎస్‌జీటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని, శిక్షణకు వచ్చిన ఉపాధ్యాయులు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూరుకు సంఘీభావంగా ర్యాలీ



అయిజ: ఆపరేషన్ సిందూర్‌కు సంఘీ భావంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకుల సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌక్ మీదుగా తెలంగాణా చౌరస్తా వరకు ర్యాలీ చేశారు. భారత్ మాతాకీ జై, జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భగత్‌రెడ్డి, శివారెడ్డి, వెంకట్రాములు, ఆంజనేయులు, తాహేర్, హనుమంతు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు గౌరవ వేతనం చెల్లించాలి

అలంపూర్: ఎన్యుమరేటర్లకు గౌరవ వేతనం చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ కోరారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ సంతోష్‌కు యూటీఎఫ్ నాయకులు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు గౌరవేతం చెల్లించాలని సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. జిల్లాలో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. కానీ ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఇప్పటికీ గౌరవ వేతం చెల్లించలేదన్నారు. తక్షణమే గౌరవ వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, కార్యదర్శులు వెంకటరమణ, చంద్రకాంత్, రాజశేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కేసు నమోదు

మానవపాడు: ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి జరిగిన ఘర్షణలో కేసు నమోదైన సంఘటన మండలంలోని అమరవాయి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపినా వివరాలు.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కనమడకలకు చెందిన మౌలాలి, వెంకటేశ్వర్లు, నందికొట్కూర్ తాలూకా మిడ్తూర్ మండలం చౌట్కూర్ గ్రామానికి చెందిన పింజరి హుస్సేన్, చిన్న హజీసాయిబ్ ఆదివారం అమరవాయిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో మందుతాగుతూ నలుగురు ఘర్షణ పడి అమరవాయికి చేరుకున్నారు. అనంతరం పింజరి హుస్సేన్, చిన్న హజీసాయిబ్‌లు మౌలాలి, వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. గాయపడిన మౌలాలి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సీడ్ రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గద్వాల: సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు కలిసి రైతులను నిండా ముంచుతున్నారని, సీడ్ పత్తి విత్తనాల పాకెట్ ధరల విషయంలో గందరగోళం సృష్టిస్తున్నారని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హనుమంతునాయుడు అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జీఎంఎస్ వెరైటీ పాకెట్ ధర రూ.500, కన్వెన్షన్ వెరైటీకి రూ.600 ఇవ్వాలన్నారు. కంపెనీలు, ఆర్గనైజర్లు సమన్వయంతో రైతులకు మద్దతు కల్పించి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం కురిసిన అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చక్రధర్‌రావు, మోనేష్, శేఖర్, బీచుపల్లి, గంజిపేటరాజు, భాస్కర్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

సీడ్ ఆర్గనైజర్ల దోపిడీని అరికట్టాలి

నడిగడ్డలో సీడ్ ఆర్గనైజర్లు పత్తి విత్తనాలు ఫెయిల్ కాకున్నా ఫెయిలైనట్లు చూపెడుతూ రైతులను మోసం చేస్తున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు గొంగళ్ల రంజిత్‌కుమార్, బుచ్చిబాబు మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. రైతులు పండించిన విత్తనాలు ఫెయిల్ అయితే వాటికి సంబంధించి రీశాంపిల్ పెట్టాలని, అలా కాకుండా ఆర్గనైజర్లు మభ్యపెడుతూ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయని పక్షంలో న్యాయ స్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములు, శ్రీనివాసులు, కార్తీక్, మునెప్ప, కృష్ణ, వెంకటేష్, లక్ష్మన్న, దొడ్డన్న, గోపాల్, భూపతి, ఆశన్న పాల్గొన్నారు.

అదుపుతప్పి వాహనం బోల్తా



ఎర్రవల్లి: జాతీయ రహదారిపై అదుపుతప్పి బొలెరో వాహనం బోల్తా పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి బొలెరో వాహనం బిస్కెట్ల లోడుతో కర్నూల్‌కు వెళ్తుండగా జింకలపల్లి స్టేజీలో డ్రైవర్ అజాగ్రత్త కారణంగా వాహనం అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ తేలికపాటి గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో బొలెరో వాహనాన్ని రహదారిపై తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు.

రైతు నేస్తంలో పాల్గొనండి

వీపనగండ్ల: వానాకాలం పంటల సాగు, యాజమాన్య పద్ధతులు అనే అశంపై మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రస్థాయిలోని శాస్త్రవేత్తలు ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు.

సవారమ్మ దేవత ఉత్సవాలు ప్రారంభం

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ దేవత ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే సమీపంలోని కృష్ణానదికి వెళ్లి పవిత్ర జలాలను జల్ది బిందెలతో తీసుకుచ్చి అమ్మవారి మూల విరాట్‌ను అభిషేకించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పణతో పాటు కోళ్లు, పొటేళ్లు బలిచ్చి భక్తులు మొక్కు లను తీర్చుకుంటారు. ఆలయానికి వచ్చే భక్తుల కు అవసరమైన తాగునీటి వసతిని కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్మృతివనంలో వసతులు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గద్వాల: పట్టణంలో రాజీవ్‌మార్గ్‌లో ఉన్న స్మృతివనంలో కనీస వసతులు కల్పించాలని సీనియర్ సిటీజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కే.మోహన్‌రావు కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ఫిర్యాదుల దినోత్సవంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. యోగా కేంద్రం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ఓపెన్ జిమ్, సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్లలో టీవీ, దినపత్రికలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా 17వ వార్డు కొత్త హౌసింగ్ బోర్డులో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలన్నారు. అదే విధంగా జిల్లా గ్రంథాయంలో మౌలిక వసతులు లేక పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నట్లు బీఆర్‌ఎస్వీ నాయకులు కుర్వపల్లయ్య కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో పరుశురాముడు, చిన్న ఆంజనేయులు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఫార్మర్‌లో నమోదు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నరేష్

ఎర్రవల్లి: వ్యవసాయ భూమి కల్గిన ప్రతి రైతు తప్పకుండా ఈ-ఫార్మర్‌లో నమోదు చేసుకోవాలని ఏఈఓ నరేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బీచుపల్లి రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం చేపట్టిన భూ ఆధార్ (ఈ-ఫార్మర్) నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు అందించేందుకు ప్రక్రియ చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా ఈ- ఫార్మర్ నమోదు ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యంగా పీఎం కిసాన్ పథకానికి సంభందించిన తదుపరి నిధుల విడుదలకు ఈ ఫార్మర్ నమోదును ప్రామాణికంగా తీసుకోవాలని కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కావునా రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానం ఉన్న మొబైల్ నంబర్‌తో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, శంకరమ్మ, వరలక్ష్మి, పరుశరాముడు, వేణు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: భూమి కల్గిన ప్రతి రైతు ఈ- ఫార్మర్‌లో నమోదు చేయించుకోవాలని ఏఈఓ భరత్‌సింహ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతలకుంటలో ఈ- ఫార్మర్ నమోదుపై అవగాహన సమావేశం నిర్వహించారు. అనంతరం రైతుల చేత నమోదు చేయించారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



పాతపాలెం శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

కేటీదొడ్డి: మండల పరిధిలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం 6, 7, 8 తరగతుల విద్యార్థుల కోసం వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు శిబిరాలు ఉపయోగపడుతాయన్నారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపులో నైపుణ్యాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్, ఉపాధ్యాయులు ప్రహ్లాద్, సీఆర్పీ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాల పంపిణీ



ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

గట్టు: మండల పరిధిలోని గంగిమాన్‌దొడ్డి గ్రామంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ప్రబోధ సేవా సమితి సభ్యులు పంపిణీ చేశారు. అనంతరం భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి జ్ఞానం గురించి తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కర్మయోగం విశిష్టత తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, సభ్యులు రంగప్ప, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై జాగ్రత్త వహించాలి



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

మానవపాడు: గర్భిణులు రక్తహీనతకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని, పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యురాలు హేమమానస అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అమరవాయి, మానవపాడుకు చెందిన 34 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్షితంగా ప్రసవాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెలెన్, చంద్రన్న, జయమ్మ, దేవమ్మ, రేవతి, ఆశాలు, సిబ్బంది, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఎద్దులు మృతి



మల్దకల్: పిడుగుపాటుతో రెండు ఎద్దులు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని మద్దెలబండ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. మద్దెలబండ గ్రామంలో నర్సింహులుకు చెందిన రెండు కాడెద్దులను పొలం పనులు ముగించుకొని అక్కడే ఉంచాడు.ఆదివారంరాత్రి ఉరుములతో కూడిన వర్షంతోపాటు పిడుగు పడడంతో రెండు ఎ ద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.1.50 ల క్షల విలువైన ఎద్దులు మృతి చెందాయని,ప్రభు త్వం తరపున ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మహిళా సమాఖ్యలో ఆడిటింగ్



మానవపాడు: మండలంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాలకు సంబంధించి సోమవారం ఆడిటింగ్ నిర్వహించినట్లు ఆడిటర్ ఆంజనేయులు తెలిపారు. 2024- 25కు సంబంధించి సాధారణ ఆడిటింగ్‌లో భాగంగా మండలంలోని 22 మహిళా సంఘాలకు సంబంధించి రిజిస్ట్రర్లు, రిపోర్ట్‌లకు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భీమన్న, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ పంచాయతీగా ప్రకటించాలి'

ఎర్రవల్లి: మండల పరిధిలోని దువాసిపల్లిని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం తమ గ్రామం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సాసనూలు గ్రామ పంచాయతీలో ఆమ్లేట్ గ్రామంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 1,200 మంది జనాభా ఉన్న గ్రామాన్ని జీపీగా ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్య క్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పరమశివుడికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల కె.నీలాంజనుడు - 9642913894
అలంపూర్/అయిజ ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బార్ లాల్ : 9553955603